4న కురుపాంలో జాబ్ మేళా

పార్వతీపురం : జాబ్ మేళాను ఈనెల 4న కురుపాంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా ఈ జాబ్ మేళాను ఉదయం 9గంటల నుండి కురుపాం గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ చదువుకొని 18 నిండి 25 ఏళ్లు గల నిరుద్యోగ యువతీ, యువకులు హాజరు కావచ్చునని తెలిపారు. కావున ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను https://skilluniverse.apssdc.in వెబ్ సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, మరిన్నివివరాలకు 6303493720, 8978878557న సంప్రదించాలని, ఆసక్తి గల యువత మెగా జాబ్ మేళాలో పాల్గొనాలని ఆయన కోరారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా వేదిక : మంత్రి

ప్రజాశక్తి - సాలూరు

ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటు చేసినట్టు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆమెతో పాటు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, ఐటిడిఎ ఇన్‌ఛార్జ్ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ గ్రామాల్లో గల ప్రజా సమస్యలు అధికారుల దృష్టిలో పెట్టి సమస్యలు పరిష్కారానికి ఈ వేదిక ఏర్పాటు చేశామన్నారు. జిల్లా కలెక్టరు ఎ.శ్యామ్ ప్రసాద్, మాట్లాడుతూ ప్రజలు అందించిన అర్జీలపై వెంటనే చర్యలు తీసుకుంటున్నామన్నారు. అర్జీలు పెండింగ్ ఉండరాదని అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై 238 అర్జీలు ప్రజలు అందజేశారు. అలాగే పార్వతీపురంలోని కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ సోభిక ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో అన్నిశాఖలకు చెందిన జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను స్వీకరిస్తున్న మంత్రి సంధ్యారాణి

మండలానికో రోజు గ్రీవెన్స్ సెల్ : సంధ్యారాణి

తన నియోజకవర్గంలో మండలానికో రోజు గ్రీవెన్స్ సెల్ నిర్వహించనున్నట్లు గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి చెప్పారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక అనంతరం కలెక్టర్‌తో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రజాసమస్యలపై గడిచిన ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. అందుకే ప్రజలు ఇప్పుడు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతులు అందజేస్తున్నారని చెప్పారు. వచ్చే నెల నుంచి నియోజకవర్గ పరిధిలోని ఒక్కో మండలంలో ఒక్కో రోజు గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తామని చెప్పారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

వైటిసి సిబ్బంది జీతాలు ఇప్పించండి

వైటిసిలో పని చేస్తున్న సిబ్బందికి 42నెలల జీతాలు బకాయి వుందని, గర్భిణీ స్త్రీల వసతి గృహం లో పనిచేస్తున్న సిబ్బందికి 25నెలల జీతాలు బకాయి వుందని, కొన్ని నెలలైనా మంజూరు చేయాలని కోరుతూ వైటిసి మేనేజర్ విద్యాసాగర్ ఆధ్వర్యాన సిబ్బంది మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయాలని మంత్రి సిబ్బందికి సూచించారు.

కమిషనర్‌పై మంత్రి అసంతృప్తి

స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా వి.హెచ్.సత్యనారాయణ నియామకంపై మంత్రి సంధ్యారాణి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌కు కమిషనర్ సత్యనారాయణ హాజరయ్యారు. పట్టణ సమస్యలపై వినతులు వచ్చినప్పుడు కమిషనర్‌ను కలెక్టర్ శ్యాం ప్రసాద్ పిలవగా సత్యనారాయణ లేచి నిలబడ్డారు. ఇంకొకరి సాయం ఉంటే గానీ నడవలేని స్థితిలో ఉన్న కమిషనర్ సత్యనారాయణను చూసి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, మంత్రి సంధ్యారాణి అవాక్కయ్యారు. కమిషనర్‌ను సరెండర్ చేయాలని మంత్రి సంధ్యారాణి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్‌తో చెప్పినట్లు తెలుస్తోంది. అస్తవ్యస్తంగా ఉన్న మున్సిపాలిటీని చక్కదిద్దాలంటే యువకుడైన అధికారిని నియమించాలని కోరితే ఊతలేకుండా నడవలేని స్థితిలో ఉన్న వ్యక్తిని ఎలా నియమిస్తారని మంత్రి సంధ్యారాణి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. కొద్ది రోజుల క్రితం మున్సిపాలిటీ అభివృద్ధి పై జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ సమీక్ష నిర్వహించిన సందర్భంలో కూడా ఇదే విషయాన్ని చెప్పారు. యువకుడైన కమిషనర్‌ను నియమించాలని మున్సిపల్ ఉన్నతాధికారిని కోరుతానని కలెక్టర్ చెప్పారు. అయితే అటు మంత్రి సంధ్యారాణి, ఇటు జిల్లా కలెక్టర్ అభీష్టానికి వ్యతిరేకంగా మున్సిపల్ కమిషనర్‌ను నియమించడం చర్చనీయాంశమవుతోంది.

విస్తృత తనిఖీలు నిర్వహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నివారణకు విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని జిల్లా కలెక్టరు ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల రవాణా నివారణకు పోలీసు, ఫారెస్ట్, ఎక్సైజ్ శాఖలతో జాయింటు ఆపరేషను నిర్వహించాలని తెలిపారు. బస్సులు, రైల్వే స్టేషన్ లలో డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు నిర్వహించాలన్నారు. చెక్ పోస్టులు వద్ద సిసి కెమెరాలు, కంట్రోలు రూం ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యా సంస్థల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ మాదక ద్రవ్యాల ప్రభావం పడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యా సంస్థల దగ్గరలో గల షాపుల్లో తనిఖీలు నిర్వహించాలన్నారు. అటవీ ప్రాంతాల్లో డ్రోన్ ద్వారా నిఘా నిర్వహించాలని తెలిపారు. నూతన మద్యం పాలసీ అమలుకు దుకాణాల కేటాయింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎస్‌పి మాధవరెడ్డి మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు రవాణా జరగకుండా అన్ని శాఖలు చర్యలు చేపట్టాలని తెలిపారు. అటవీ ప్రాంతాల్లో సాగు చేయకుండా ఆ శాఖ చర్యలు తీసుకోవాలని తెలిపారు. రవాణా శాఖ అధికారులు లారీయజమానులతో సమావేశం నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా మార్పులు చేసిన వాహనాలను గమనించినట్లయితే సమాచారం అందించాలని తెలిపారు. ఎఎస్‌పి ఒ.దిలీప్ కిరణ్ మాట్లాడుతూ ఈ ఏడాది ఇప్పటి వరకు 22 కేసుల్లో 276 కేజీల గంజాయి పట్టుకొని 44 మందిపై కేసులు పెట్టినట్లు తెలిపారు. చట్టరీత్యా విద్యా సంస్థలకు 300 మీటర్ల దూరంలో సిగరెట్, మద్యం, మత్తు పదార్థాల విక్రయం, సరఫరా జరగరాదని తెలిపారు. సమావేశంలో డిఎఫ్ఒ జివిపి ప్రసూన, పాలకొండ డిఎస్పీ రాంబాబు, వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎం వినోద్, జిల్లా బిసి, సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారు ఎస్.కృష్ణ, ఎం.డి.గయాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, పక్కన ఎస్‌పి మాధవరెడ్డి

ముగిసిన ఫార్మర్ సైంటిస్ట్ కోర్సు శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - గరుగుబిల్లి :

మండలంలోని తోటపల్లి జట్టు ఆశ్రమంలో ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ సహకారంతో రైతు సాధికార సంస్థ నిర్వహణతో నాలుగురోజులు పాటు నిర్వహించిన ఫార్మర్ సైంటిస్ట్ కోర్స్ శిక్షణా తరగతులు సోమవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా జట్టు ట్రస్ట్ అధినేత డాక్టర్ డి.పారినాయుడు మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమానికి శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల నుండి 87 మంది రైతులు పాల్గొన్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారులు పి.దేవుళ్లు, కె.ప్రకాష్, జి.హేమ సుందర్, జిల్లా డిపిఎం పి.షణ్ముఖ రాజు, టిడిపి వి.నాగరాజ్, బి.గణేష్, డిపిపి మానస, మెంటర్లు, ఫార్మర్ సైంటిస్టులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న విజయకల్యాణి

హాస్టల్‌ను సందర్శించిన జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

స్థానిక బిసి బాలికల వసతిగృహాన్ని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కె.విజయ కళ్యాణి ఆకస్మికంగా సందర్శించారు. అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ అప్పన్న, హాస్టల్ వార్డెన్ సుభద్ర సమక్షంలో వసతి గృహం రికార్డులను పరిశీలించారు. వసతి తృహంలో 54 మంది బాలికలున్నట్లు తెలిపారు. వసతి గృహాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నట్లు తెలుసుకున్నారు. 54 మంది విద్యార్థులకు 9 గదులు మాత్రమే ఉన్నాయి. వంటగది, స్టోర్ రూమ్ను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు అవుతున్నదీ లేనిదీ పరిశీలించారు. విద్యకు సంబంధించి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సరిగ్గా అమలవుతున్నదీ లేనిదీ పరిశీలించారు. విద్యార్థులకు సకాలంలో వైద్య సేవలు అందించడానికి వైద్య సిబ్బంది ఎవరైనా వస్తున్నారా లేదా అని ఆరా తీశారు. భవనం శ్లాబ్ పెచ్చులూడి వర్షానికి లీకవుతున్నట్లు గమనించారు. తుప్పు పట్టి పెచ్చుఊడిపోవడాన్ని పరిశీలించారు. మరుగుదొడ్లను పరిశీలించగా అవి చాలా అపరిశుభ్రంగా ఉన్నట్లు గమనించారు. వెంటనే అటెండర్ను పిలిచి మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

మెప్మా అర్బన్ మార్కెట్ ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీలో కోటదుర్గ ఆలయ ఆవరణలో మెప్మా అర్బన్ మార్కెట్‌ను పట్టణ టిడిపి అధ్యక్షులు గంటా సంతోష్ కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక కార్యకలాపాలు మహిళలంతా జరిపేందుకు ఇది మంచి కార్యక్రమమన్నారు. ఆర్థిక స్వాలంబన దిశగా ముందుకు సాగి వ్యాపారంలో పెట్టుబడులు పెట్టి అభివృద్ధి కావాలన్నారు. మహిళలు పెట్టిన ఉత్పత్తులు సంతృప్తిగా ఉందన్నారు. మెప్మా సిఎంఎం కృష్ణారావు మాట్లాడుతూ స్వయంశక్తి మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించి ఆర్థిక జీవన ప్రమాణాలు పెరుగుదలకు ఈ మార్కెట్ ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమం లలిత, దావాలమ్మ, తదితరులు ఉన్నారు

ఇవిఎం గోదాం తనిఖీ

ప్రజాశక్తి - పార్వతీపురం

త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఇవిఎం గోదాములను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సోమవారం సాయంత్రం తనిఖీ చేశారు. గోదాములకు వేసిన సీళ్లను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి సిబ్బందితో తెరిపించారు. అనంతరం భద్రపరచిన ఇవిఎంలను పరిశీలించారు. అనంతరం వాటికి తిరిగి సీళ్ల వేయించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

బాల్యవివాహాలు జరుగకుండా చూడాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ, సాధికారతా అధికారిణి ఎంఎన్ రాణి తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశమందిరంలో బాల్యవివాహాలు, కిశోర వికాసం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై సిడిపిఒలకు, సూపర్ వైజర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాల నివారణకు, ప్రతి బాలిక బడికి వెళ్లేలా ప్రోత్సహించాలని తెలిపారు. బడి, కాలేజీ మానివేసిన 15- 18 ఏళ్లలోపు బాలికలతో బాలికా సమూహాలు ప్రతి గ్రామంలో ఏర్పాటు చేయాలని తెలిపారు. బాలికా సమూహాల్లో మహిళా పోలీసులు కూడా ఉండాలని, వారితో తరచూ సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. వారికి ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాల్యవివాహాలు నిర్వహిస్తే చట్టపరంగా తీసుకొనే చర్యలు, శిక్షలు గూర్చి తెలియజేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలో గల ప్రోజెక్టు అధికారులు, సూపర్ వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ పోటీలను ప్రారంభించిన మంత్రి

ప్రజాశక్తి -సాలూరు రూరల్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ క్రీడా ఎంపికల్లో స్త్రీ, శిశు సంక్షేమం, గిరిజన శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పోటీలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో వాలీబాల్ చేపట్టి ఆటలు ఆడి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నుంచి అన్ని సహాయ సహకారాలు అందిస్తామని, జిల్లా స్థాయిలో ఎంపికైన జట్లను రాష్ట్ర స్థాయికి పంపిస్తామని, వారికి ఆర్థికంగా ప్రభుత్వం నుంచి ఆదుకుంటామని ఆటల్లో మంచి ప్రతిభ కనబర్చి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు మంత్రి సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయుల, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా మున్సిపల్ సమావేశం

ప్రజాశక్తి- సాలూరు

మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ అధ్యక్షతన సోమవారం సాయంత్రం మున్సిపల్ సమావేశం తూతూ మంత్రంగా నిర్వహించారు. ఈనెల సమావేశంలో అజెండాలో వున్న అంశాలను కౌన్సిలర్‌లు ఆమోదించారు. అనంతరం కౌన్సిలర్‌లు గిరి రఘు, బి.శ్రీనివాసరావు, గొర్లి వెంకటరమణ పట్టణంలో పారిశుధ్యం పై మాట్లాడారు. పారిశుధ్య నిర్వహణ అధ్వాన్నంగా ఉందని అన్నారు. అంతకుముందు కొత్తగా విధుల్లో చేరిన కమిషనర్ సిహెచ్ సత్యనారాయణ సభలో పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు రాపాక మాధవరావు, పప్పల లక్ష్మణరావు, లింగాల దుర్గా, జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న కాంట్రాక్టు,, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, సిఐటియు నాయకులు

సమాన పనికి సమాన వేతనమివ్వాలి

సిఐటియు ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, వారికి మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్, వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ బివి రమణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, పథకాల్లో లక్షలాదిమంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, డైలీ వేజ్, కంటింజెంట్ పద్ధతుల్లో పనిచేస్తున్నారని, వీరికి మినిమం టైమ్ స్కేల్, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులతో వెట్టిచాకిరీ చేయించుకుని చట్ట ప్రకారం చెల్లించాల్సిన జీతాలు, ఇతర హక్కులు కల్పించడం లేదని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాల్సి ఉన్నప్పటికీ చెల్లించకుండా ఉద్యోగులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. ఆప్కాస్ విధానాన్ని రాష్ట్రంలో తీసుకొచ్చిన తర్వాత ఈ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలకు అమ్మబడి, పెన్షన్లు, ఆరోగ్యశ్రీ వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా అమలు కావడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్, డైలీ వేజ్ వంటి పద్ధతుల్లో పనిచేస్తున్న అందరిని రెగ్యులరైజ్ చేయాలని, రెగ్యులరైజ్ చేసే వరకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, సంక్షేమ పథకాలన్నీ ఈ ఉద్యోగులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. లేనిచో భవిష్యత్తులో సిఐటియు, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కాంట్రాక్టు ఉద్యోగులను ఐక్యం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిని అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర, కోశాధికారి గొర్లి వెంకటరమణ, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగ సంఘాల నాయకులు ఎం.ప్రసాద్, సూర్యనారాయణ, జి.బాలకృష్ణ, వై.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ సమావేశంలోనూ అదే తీరు..

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సమావేశంలో అజెండాను సభ్యులు ఆమోదించకుండా సోమవారం జరిగిన సమావేశంలోనూ అదే తీరును కనబర్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గత రెండు నెలలుగా కౌన్సిల్ సమావేశం అజెండాలో పొందుపరిచిన అంశాలు మున్సిపల్ ఉద్యోగి చదివి వినిపిస్తుండగానే అజెండాను ఆమోదించకుండానే వైసిపి సభ్యులు వాకౌట్ చేయడం జరిగింది. అయితే సోమవారం కౌన్సిల్ సమావేశ ప్రారంభమైన వెంటనే, పాలకవర్గ వైసిపి పార్టీకి చెందిన 9 మంది కౌన్సిలర్లు సమావేశం నుండి వెళ్లిపోయారు. ఈ విషయంపై వాకౌట్ చేసి సమావేశం నుండి వెళ్లిన కౌన్సిలర్లకు వివరణ కోరగా చైర్పర్సన్, కమిషనర్ తీరు నచ్చకే వెళ్ళిపోతున్నామని చెప్పడం విశేషం. అయితే మిగిలిన 8మంది అధికారం వైసిపి కౌన్సిలర్లతో పాటు ముగ్గురు వైసిపి కోఆప్షన్ సభ్యులు, టిడిపి సభ్యులు, ఇండిపెండెంట్ సభ్యుడితోనే సమావేశంలో 32 అంశాలతో కూడిన అజెండాను ఆమోదించడం చర్చనీయాంశంగా మారింది. ఈ సమావేశంలో వైసిపి, టిడిపి, ఇండిపెండెంట్ కౌన్సిల్ సభ్యులు తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలపై మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యంగా మంచినీటి సమస్య చాలా తీవ్రంగా ఉందని, పారిశుధ్య నిర్వహణతో పాటు, శ్మశానాల అభివృద్ధి, రోడ్లు, కాలువల అభివృద్ధిపై దృష్టి పెడుతున్నట్టు తెలిపారు. పార్టీలకు అతీతంగా మీమీ వార్డుల్లో సమస్యలు ఏమైనా ఉంటే చైర్పర్సన్ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. దీంతో 7, 10, 26వార్డుల కౌన్సిలర్లు బొత్స ఆనంద్, పొట్లూరు దివ్య, బెలగాం కరుణ తమ వార్డుల్లో ఉన్న దీర్ఘకాల సమస్యలపై ప్రస్తావిస్తూ, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే టిట్కో ఇళ్ల కోసం లబ్ధిదారులు డబ్బులు చెల్లించారని లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. 8,1వ వార్డు కౌన్సిలర్లు కోరాడ నారాయణరావు, రణభేరి శివకుమార్ మాట్లాడుతూ పట్టణంలో ఎన్నో ఆక్రమణలు జరుగుతున్నాయని, అనధికార భవన నిర్మాణాలు జరుగుతున్నాయని, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోకి వెళ్లేందుకు రహదారిని మూసి షాపులు నిర్మించడం జరిగిందని, ఆక్రమణ తొలగించాలని, షాపింగ్ కాంప్లెక్స్‌కు మరమ్మతులు చేపట్టాలని, ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదని తెలిపారు. కొత్తవలసలో అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయాలని, అలాగే పట్టణానికి ప్రతిరోజు పలు గ్రామాల నుంచి ఎంతోమంది ప్రజలు వసున్నారని, వారికి మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ, ఆక్రమణలు అనధికార భవన నిర్మాణాలపై సమాచారం ఇస్తే చర్యలు తీసుకోవడంతో పాటు, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు., ప్రతినెలా జరిగే కౌన్సిల్ సమావేశానికి మున్సిపల్ అధికారులతో పాటు రెవెన్యూ, విద్యుత్ తదితర విభాగాల అధికారులు పక్కాగా హాజరయ్యేలా చూడాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్, మేనేజర్ డి.లక్ష్మి, ఎఇ జి.ఆనంద్, రెవిన్యూ అధికారి రూబేను దిబ్బ, ప్రజారోగ్య అధికారి కె. పకీరు రాజు, ఆర్ఐలు ఈశ్వరరావు, వినయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గ్రూపులుగా విడిపోయిన వైసిపి కౌన్సిలర్లు
సమిష్టిగా పట్టణాభివృద్ధి : ఎమ్మెల్యే

సమావేశం నుంచి వాకౌట్ చేస్తున్న వైసిపి కౌన్సిలర్లు

రెవెన్యూ అధికారులకు పెత్తందారుల ఆక్రమణలు కనబడవా?

ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి - మక్కువ

మండలంలో రెవెన్యూ అధికారులకు పెత్తందారుల ఆక్రమణలు కనిపించకుండా ఒక్క తూరుమామిడిలోనే ఆక్రమణలు కనిపించాయా అంటూ ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి ప్రశ్నించారు. సోమవారం తూరుమామిడిలో పేదలు కట్టుకుంటున్న ఇళ్లను కృష్ణమూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ తూరుమామిడిలో ఇళ్ల స్థలాలకు కొనుగోలు చేసిన స్థలంలో సరిహద్దులు వేయకుండా పేదలకు పట్టాలిచ్చారని, ఆ ఇళ్ల స్థలాల్లో స్కూల్ కూడా నిర్మించడంతో పేదలు ఎవరికి నచ్చిన చోట వారు ఇళు కట్టుకున్నారని అన్నారు. అందరిలాగే బొడ్డాన పైదమ్మ, గంగతో పాటు మరి కొంత మంది పేదలు గతంలో ఉన్న పూరిళ్ల స్థానంలో రేకు, స్లాబ్ ఇళ్లు కట్టుకుంటున్నామని తెలిపారు. స్థానిక సర్పంచ్ వారిపై రాజకీయ కక్షతో కూల్చి వేయడానికి ప్రయత్నిస్తున్నాడని, దీనికి రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందరితో పాటు తామూ ఇళ్లు కట్టుకుంటే కాలనీలో ఉన్న అన్ని ఇళ్లు విచారణ చేయకుండా, కేవలం తమవే విచారించి నోటీసులు ఇవ్వడమేమిటని ప్రశ్నించారు. ఈ కాలనీలో పట్టాల్లేకుండా కొంత మంది వారికి నచ్చిన చోట స్థలం ఆక్రమించుకుంటే వారిని రెవెన్యూ అధికారులు ఏమీ అనడం లేదని మమ్మలనే ఇబ్బందులు పడుతున్నారు వాపోయారు.

అనంతరం కృష్ణమూర్తి మాట్లాడుతూ ఒక్క తూరుమామిడిలోని ఆక్రమణలే రెవెన్యూ అధికారులు కనిపించాయా? మక్కువ మండలంలో ఇంకెక్కడా కనిపించలేదానని ప్రశ్నించారు. మక్కువ మెయిన్ రోడ్డుకు ఆనుకొని ఉన్న బైరి సాగరం చెరువును కప్పేసి కొంత మంది కోటీశ్వరులు దర్జాగా ఆక్రమించుకొని పెద్దపెద్ద భవనాలు కట్టి, షాపులు, హోటళ్లు నిర్మించి వ్యాపారాలు చేసుకుంటుంటే రెవెన్యూ అధికారులకు కనిపించలేదా అని ప్రశ్నించారు. అలాగే మెళాపువలస కాలనీలో వెంగళరావు సాగర్ ప్రాజెక్ట్ కాలువ గట్టుపై షాపులు, ఇళు కట్టుకున్నారని, వెంగళరాయసాగర్ ప్రాజెక్ట్ దిగువన ప్రాజెక్ట్ భూమిలో ఏకంగా ఊరే కట్టేశారని, ఎ.వెంకంపేటలో బొబ్బిలి మెయిన్ రోడ్డుకు ఆనుకొని ఉన్న చెరువును పెత్తందార్లు ఆక్రమించుకున్నారని, ఇవేవీ అధికారులకు కనిపించలేదా అని అన్నారు. వీటిపై ఇప్పటికే ఫిర్యాదులు చేశామని, అవేవీ విచారణ చేయకుండా కేవలం తూరుమామిడిలో పేదల ఇళ్లు కూల్చడానికి నోటీసులివ్వడం అంటే సర్పంచ్‌తో లాలూచీ పెడుతున్నారని అర్థమవుతుందని అన్నారు. ఇప్పటికైనా తూరుమామిడి పేదలకు ఇచ్చిన నోటీసులు వెనక్కు తీసకోవాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారులు తూరుమామిడి సాల్వెల్యాండ్ మొత్తం సర్వే చేయాలని, పేదలందరికీ పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో అక్రమంగా ఆక్రమించిన బైరి సాగరం చెరువు ఆక్రమణలు తొలగించాలని, ఇతర చెరువులు, కాలువల్లో ఆక్రమణలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, పేదలు పాల్గొన్నారు.

పెత్తందారుల ఆక్రమణలో ఉన్న కట్టడాలను పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు కృష్ణమూర్తి

పువ్వలను పరామర్శించిన బొత్స

ప్రజాశక్తి- సాలూరు

అర్బన్ బ్యాంక్ మాజీ అధ్యక్షుడు పువ్వల నాగేశ్వరరావుని సోమవారం శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పరామర్శించారు. పువ్వల నివాసానికి వెళ్లి ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బొత్స వెంట జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ఉన్నారు. అనంతరం బొత్స సత్యనారాయణ రాజన్నదొర నివాసానికి వెళ్ళారు. మీడియాతో మాట్లాడడానికి నిరాకరించారు.

ఘనంగా ఓజోన్‌పొర దినోత్సవం

ప్రజాశక్తి- సాలూరు రూరల్

స్థానిక మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల బాలికల పాఠశాలలో సోమవారం ఓజోన్‌పొర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రీన్ ఆర్మీ స్వచ్ఛంద సంస్థ బలగ గణేష్ ఆధ్వర్యంలో వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. పెంటయ్య, గ్రీన్ ఆర్మీ ఫౌండర్ బలగ గణేష్ పోటీలలో విజేతలైన విద్యార్థులకు జ్ఞాపికలు, పర్సనాలిటీ డెవలప్మెంట్ పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేట గిరిజన బాలుర గురుకుల కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, పీడీ లక్ష్మణమూర్తి తెలిపారు. జిల్లాస్థాయి పోటీలో ఇటీవల పాల్గొని అనంతరం రాష్ట్రానికి ఎంపికయ్యారని సౌత్‌జోన్‌లో అథ్లెక్స్, జావింగ్ త్రో దిలీప్ ద్వితీయ స్థానం, లాంగ్ జంప్‌లో ఎస్ ప్రవీణ్ ద్వితీయ స్థానంలో సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్‌లో 19 సంవత్సరాల లోపు విద్యార్థులు ఎస్.దిలీప్ 400 మీటర్లు రన్నింగ్ ఎంపికయ్యారని, ఏ.రవి షాట్‌పుట్‌లో ఎంపికయ్యారని, ఎస్.శరత్‌కుమార్ 100 మీటర్ల పరుగు పందెంలో, సతీష్ ట్రిపుల్ జంప్‌లో, గణేష్, విజయ్ కుమార్, ప్రవీణ్ కుమార్, డియోన సబీర్ హాకీలో, హారిక అర్జున్ ఖోఖోలో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని ఆయన తెలిపారు.

కౌమార దశలో సత్ప్రవర్తన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కౌమార దశలో లింగం భేదం లేకుండా కొన్ని శారీరక, మానసిక సమస్యలను తెలివిగా ఎదుర్కొని ఎవరికి ఇబ్బంది లేకుండా మెలగాలని ఆడాల్ సెంట్ హెల్త్ కౌన్సిలర్ ప్రమీల అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ కుమారి శ్రీవాణి ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వరం అధ్యక్షతన కౌమార విద్యార్థులకు అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కౌమార దశలో ఉంటూ యుక్త వయసుకు వెళుతున్న విద్యార్థులు మానసిక ఉద్రేకాలను అదుపు చేసుకుంటూ విద్య పట్ల శ్రద్ధ వహించి ఇతరులతో చక్కటి ప్రవర్తన కలిగి ఉండాలని అన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ వయసులోని పిల్లలు కొన్ని విషయాలు పట్ల ఆకర్షితులవుతారని కానీ మన భవిష్యత్తుకు భంగం కలిగే వాటి పట్ల దూరంగా ఉండాలని, మనసును అదుపులో ఉంచుకొని చదువు పట్ల ఆసక్తి కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా, ఫ్యాను వితరణ

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని దబ్బగెడ్డ ప్రాథమిక పాఠశాలకు ఐరన్ బీరువా, సీలింగ్ ఫ్యాన్లు వితరణ ఇచ్చినట్లు ఎంఇఒ పి. సత్యనారాయణ తెలిపారు. గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు కె. సాయికుమార్ బీరువా, ఇప్పిలి లోకేష్ సీలింగ్ ఫ్యాన్‌లను ఉచితంగా అందించారని చెప్పారు. ఇప్పటివరకు పాఠశాల రికార్డులు కోన పాఠశాలలో భద్రపరిచామని ఇకపై స్థానిక పాఠశాలలోనే ఉంచేందుకు ఆస్కారం కలిగిందని ఆయన అన్నారు. ఉదారంగా ఇచ్చిన పూర్వ విద్యార్థులను ఆయన అభినందించారు.

మంత్రిని కలిసిన పిఒ

ప్రజాశక్తి- సాలూరు రూరల్

పార్వతీపురం మన్యం జిల్లా సబ్ కలెక్టర్, ఐటిడిఎ పిఒగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అశుతోష్ శ్రీవాత్సవ మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని సోమవారం సాలూరులోని తన నివాసంలో మర్యాదపూర్తకంగా కలిశారు.

నిష్పక్షపాతంగా తనిఖీలు నిర్వహించాలి

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

ఉపాధి హామీ పనులపై జరగనున్న సామాజిక తనిఖీలు నిష్పక్షపాతంగా, నిర్మొహమాటంగా జరిపించాలని ఎంపిపి బొంగు సురేష్ కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంఛార్జి ఎంపిడిఒ కె. రామారావు ఆధ్వర్యంలో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2023- 24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో లబ్ధిదారులకు అందాల్సిన వేతనాలపై, ఏ మేరకు ఉపాధి పనులు జరిగాయన్న అంశాలపై గ్రామాల్లో సర్వే నిర్వహిస్తూ నిష్పక్షపాతంగా, నిర్భయంగా తనిఖీలు జరిపించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు చర్యలు

ప్రజాశక్తి - వీరఘట్టం

2014-19 టిడిపి ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ గృహాలకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పట్టణ టిడిపి అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం వీరఘట్టంలో జియో ట్యాగింగ్‌ను హౌసింగ్ అధికారులు చేశారు. నిర్మాణాలు ఏ దశలో ఉన్న వాటికి బిల్లులు చెల్లించడం జరుగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నీటి సంఘం మాజీ అధ్యక్షులు బల్ల హరిబాబు, పూతి రామ్మూర్తి, రాంబాబు, దేవుపల్లి ఆనందరావు, పాలకొండ ధర్మ తదితరులు పాల్గొన్నారు.

14 అంగన్‌వాడీ కేంద్రాలు ఎంపిక

ప్రజాశక్తి - పాచిపెంట

పాచిపెంట ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని 14 కేంద్రాలు సాక్షం అంగన్‌వాడీ కేంద్రాలుగా ఎంపికైనట్లు సిడిపిఒ బి.అనంతలక్ష్మి తెలిపారు. పాచిపెంటలో ఆరు, మక్కువలో 8 కేంద్రాలు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వ నిధులతో టీవీ, వాటర్ ఫిల్టర్, చైర్స్ అండ్ టేబుల్స్, రైన్ వాటర్ ఆర్వేస్టింగ్, ఫ్యాన్, న్యూట్రీ గార్డెన్ మంజూరు చేశారన్నారు.

కోటదుర్గమ్మకు నగదు, బియ్యం విరాళం

ప్రజాశక్తి - పాలకొండ

కోటదుర్గ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయానికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేని అప్పలనాయుడు, యోగిత దంపతులు రూ.పది వేలు నగదు, 15బస్తాల బియ్యం విరాళం ఇచ్చారు. ఉత్సవ కమిటీ మెంబర్‌గా ఎంపికైన యోగిత సోమవారం బాధ్యతలు స్వీకరించి ఈ విరాళాన్ని పట్టణ టిడిపి అధ్యక్షులు గంటా సంతోష్ కుమార్‌కు అందించారు. ఉత్సవాలు ఘనంగా జరిపేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రుద్రకోటేశ్వరరావు, గార దుర్గారావు, శిల్లా గుప్త, కుమార రాజ, ఉన్నారు.

స్పెషల్ బ్రాంచ్ సిఐగా జిడి బాబు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లా స్పెషల్ బ్రాంచ్ సిఐగా బాధ్యతలు చేపట్టిన జి.దేముడుబాబు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి ఎస్‌వి మాధవ్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు,స్పెషల్ బ్రాంచ్ నిర్వహించాల్సిన విధులు, బాధ్యతల పట్ల దిశా నిర్దేశం చేశారు.

ఎక్సైజ్ సిఐగా సురేష్

పార్వతీపురం: ఎక్సైజ్ సిఐగా కె. సురేశ్ సోమవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. పార్వతీపురం సర్కిల్ పరిధిలో ఎక్కువగా ఒడిస్సా రాష్ట్రం సరిహద్దు ఉండడంతో సారా రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి నియంత్రణకు కృషి చేస్తామని అన్నారు. సర్కిల్ పరిధిలో సారా రవాణా అమ్మకాలు జరిపినట్లయితే ఉపేక్షించమని హెచ్చరించారు.

సీతంపేట ఎస్ఐగా అమ్మన్నరావు బాధ్యతలు స్వీకరణ

సీతంపేట: సీతంపేట ఎస్ఐగా వై.అమ్మన్నరావు సోమవారం బాధ్యత స్వీకరించారు. ఈయన గరుగుబిల్లి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎస్ఐ జగదీష్ నాయుడు సాలూరు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్ఐ అమ్మన్నారావు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. ప్రమాదాలు నివారణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

జియ్యమ్మవలస ఎస్ఐగా ప్రశాంత్‌కుమార్

జియ్యమ్మవలస: జియ్యమ్మవలస ఎస్ఐగా ఎన్ ప్రశాంత్ కుమార్ సోమవారం బాధ్యతలను చేపట్టారు. ఆయన ఇదివరకు పాలకొండ ఎస్ఐగా పనిచేసి బదిలీపై జియ్యమ్మ వలస వచ్చినట్లు తెలిపారు.

ప్రజాదర్బార్‌లో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి - సాలూరు రూరల్

రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తన క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాలూరు మండలం కూర్మారాజుపేట పంచాయితీకి చెందిన బడ్నాన శ్రీరామ్ దొర పెన్షన్ మంజూరు చేయాలని అర్జీ అందించారు. పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ చింతల ఎల్లంనాయుడు మాస్టర్ వరద బాధితులను ఆదుకునేందుకు రూ.10వేలు ఆర్థిక సాయం మంత్రికి అందజేశారు. ఐసిడిఎస్ పిడి ఎంఎం రాణి, పిఒలు మంత్రి కలిసి అంగన్వాడీ కేంద్రాలకు మంజూరైన ఆర్ఒ ప్లాంట్లు, నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభం తదితర విషయాలపై చర్చించారు. అక్టోబర్ 5 నుంచి ఉమ్మడి జిల్లాల పీడీలు, పిఒలు, సూపర్వైజర్లు నియోజకవర్గంలోని అంగనవాడీ కార్యకర్తలు, ఆయాలతో సమావేశం ఏర్పాటు చేయాలని వారిని మంత్రి ఆదేశించారు. సాలూరు మండలం కురుకూటి పంచాయితీ రాంపాడుకు చెందిన గిరిజనులు తమ గ్రామంలో 350 మంది నివాసిస్తున్నామని, రోడ్డు లేదని సొంపిగాం నుండి రాంపాడు వరకు రోడ్డు మంజూరు చేయాలని కోరారు. మక్కువ మండలానికి చెందిన పూడి చిన్నమ్మలు మక్కువలో మీ సేవ సెంటర్ కేంద్రం ఏర్పాటుకు అనుమతించాలని కోరారు. బాధితుల సమస్యలకు మంత్రి సంధ్యారాణి సానుకూలంగా స్పందించి అన్ని పనులు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ, మండల టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, పరమేష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 56 వినతలు

సీతంపేట: స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 56 వినతలు వచ్చాయి. ఈ గ్రీవెన్స్ ఈవో యశ్వంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సవర బొంతు గ్రామానికి చెందిన జ్యోతి ఆర్ఒఎఫ్ఆర్ పట్టా ఇప్పించాలని కోరారు. చాకలిగూడకు చెందిన రాము అంగన్వాడి భవనం మంజూరు చేయాలని కోరారు. భరణికోటకు చెందిన గోపాల్ తాగునీటి బోరు మంజూరు చేయాలని, బంధమానుగూడకు చెందిన నాగరాజు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని, చిన్న మంగళాపురం గ్రామానికి చెందిన కైలాస దొర విఆర్ఎ పోస్టు ఇప్పించాలని, జాతపు జగతి పల్లికి సిసి రోడ్డు మంజూరు చేయాలని వసంత కుమార్ కోరారు. పుట్టిగం గ్రామానికి చెందిన సుదర్శన్ రావు కుట్టు మిషన్ ఇప్పించాలని కోరారు. ఈ స్పందన కార్యక్రమంలో ఎపిఒ చినబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సింహాచలం, డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ పాలక నారాయడు, సిడిపిఒ రంగలక్ష్మి, స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకబ్ దయానంద్, ఎఎంఒ కోటిబాబు, ఎపిడి సన్యాసిరావు, డిపిఎం రమణ తదితరులు పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలి

సీతానగరం: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రాసుపత్రి వద్ద మలమూత్ర విసర్జన నిర్మూలనకై సులభ్ కాంప్లెక్స్‌ను నిర్మించాలని ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులు సవరపు రామారావు ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చిన రోగులతో పాటు సహాయకులకు అత్యవసర సమయాలలో మలమూత్ర విసర్జన చేసుకోవాలన్నా ఆత్మ గౌరవాన్ని చంపుకొని చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలలో బయట చేయవలసి వస్తుందని ఈ ఆసుపత్రిలో ప్రత్యేకించి సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని కోరారు.

బాధితురాలితో మాట్లాడుతున్న ఎస్‌పి మాధవరెడ్డి

ప్రజా సమస్యలు పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

పార్వతీపురం రూరల్: ప్రజల సమస్యలు పరిష్కరించడానికి పోలీసు సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని, ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి అన్నారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదు దారుల నుంచి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను పరిశీలించారు. కార్యక్రమంలో మొత్తం 9 ఫిర్యాదులు అందాయి. ప్రతి సోమవారం జరిగే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ స్పందన కార్యక్రమంలో సిఆర్‌బి సిఐ వివిసిఎం ఎర్రంనాయుడు, ఎస్‌బి సిఐ జిడి బాబు, డిసిఆర్‌బి ఎస్ఐ పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సంపద తయారీ కేంద్రం పున : ప్రారంభం

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక గ్రామ పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకొస్తున్నట్లు సర్పంచ్ ఎ.కళావతి తెలిపారు. సర్పంచ్ కళావతి చేతుల మీదుగా పునః ప్రారంభించారు. ప్రజలంతా తడి, పొడి చెత్త వేరు చేసి క్లాప్ మిత్రకు ఇవ్వడం వల్ల గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని తెలిపారు. ఎంపిడిఒ కె.గీతాంజలి మాట్లాడుతూ మండలంలోని 18 వరకు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్మించబడ్డాయని, వీటిని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావడానికి సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కుసిమి, శంభాం పంచాయతీల్లో వీటిని పునః ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు తిరుపతిరావు, కూర్మారావు, కార్యదర్శులు సుదర్శన్‌రావు, వినోద్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : వర్మీ కంపోస్టులు రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ఐ.గౌరీ శంకర్, పంచాయతీ కార్యదర్శి వెంకటనాయుడు అన్నారు. మండలంలోని మొండెంఖల్లు, కొండబారిడి గ్రామాల్లో స్వేచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజు గ్రామాల్లో ఉన్న చెత్తను సేకరించి వర్మీకంపోస్టు తయారీ చేసి రైతులకు అందిస్తామని, కావున రైతులు ఈ ఎరువును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి జి.విద్యారాణి, పంచాయతీ కార్యదర్శి మిన్నారావు , గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

సీతానగరం: కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

గరుగుబిల్లి: మండలంలోని శివ్వాంలో కొత్తగా నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సర్పంచ్ రాయల పోలమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ జి.పైడితల్లి మాట్లాడుతూ గ్రామాల్లో సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రాల్లో వేయాల్సి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎల్.గోపాలరావు, పంచాయతీ కార్యదర్శి బంటు అప్పారావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని చల్లమనాయుడువలస, నిడగల్లు, కాసీపేట, కృష్ణరాయపురం, కొత్తవలస గ్రామాలలో చెత్త సంపద కేంద్రాల పున ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ సర్పంచులు రెడ్డి అనిత నాయుడు, వాకాడ పారమ్మ, ఆరుద్రమ్మ, గుణుపూర్ అన్నమనాయుడు, తేలు అప్పమ్మ మాట్లాడుతూ ఈ కేంద్రాల ద్వారా సంపదలు సృష్టించి గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సూర్యనారాయణ, టిడిపి నాయకులు తేలు చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు పి. మురళీకృష్ణ, టి. పీటర్ పాలు, కె. శ్రీనివాసరావు, పి.తిరుపతి నాయుడు, కె.గౌతమితో పాటు వార్డు మెంబర్లు, గ్రీన్ అంబాసీడర్లు పాల్గొన్నారు.

2న మెగా ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని భగ్గోంద్రవలస గ్రామంలో అక్టోబర్ 2న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మాస్ సేవాసమత అధ్యక్షులు బాలు యాదవ్, ఎల్‌విఆర్ సేవా సంస్థ అధ్యక్షులు కె అరవింద్ కుమార్ తెలిపారు. శిబిరానికి జేమ్స్ హాస్పిటల్ రాగోల్ వైద్యులు పాల్గొంటారని, ఈ శిబిరంలో అన్ని రకాల తనిఖీలు నిర్వహించి, చికిత్స చేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాలూరురూరల్: గాంధీ జయంతి సందర్భంగా సాలూరు లయిన్స్ క్లబ్, అనిల్ నీరుకొండ ఆసుపత్రి వారు సంయుక్తంగా గాంధీ జయంతి సందర్భంగా లయన్స్ క్లబ్ లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఇందుపురి నారాయణ రావు తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో సుమారు 12 మంది స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొంటారన్నారు. కావున సాలూరు, పరిసర ప్రాంతాల్లోని ప్రజలు దీన్ని ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమానికి డాక్టర్ పెంట శ్రీనివాసరావు క్యాంప్ చైర్మన్ వ్యవహరిస్తారని ఆయన తెలిపారు.

మహిళా చైతన్యంతోనే అభివృద్ధి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మహిళలు చైతన్యవంతులైతే ఆ ప్రాంతం, నియోజకవర్గం, రాష్ట్రం, దేశం అనుకున్న విధంగా అభివృద్ధి చెందుతుందని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర అన్నారు. మండలంలోని పెదబొండపల్లిలో సాక్షం అంగన్వాడీ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోమవారం పాల్గొన్నారు. పిల్లలు పౌష్టికాహార లోపానికి గురి కాకుండా ఉండాలని ప్రభుత్వాలు మంచి పౌష్టికాహారం అందిస్తున్నాయన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని చిన్నారులు ఉన్నతంగా ఎదుగుటకు కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. పెద్దబొండపల్లిలో కల్యాణ మండపం, వెంకటేశ్వర ఆలయ నిర్మాణం కోసం చేసిన ప్రయత్నం విజయవంతమైందన్నారు. గ్రామస్తులకు ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు చేసిన ప్రయత్నం ఫలించిందని ఎమ్మెల్యే వివరించారు. పెదబొండపల్లి ఆదర్శ గ్రామంగా మార్చాలన్న ఆలోచనతో ఉన్నట్లు ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : సాక్షం అంగన్వాడీ కేంద్రం ద్వారా పౌష్టికాహారం అందించి ఆరోగ్య వంతులుగా ఉంచాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. గుమ్మలక్ష్మీపురంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, భద్రగిరి ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సాక్షం అంగన్వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్రావు, ఎంపిడిఒ సాల్మన్ రాజ్, ఐసిడిఎస్ పిఒ సుశీలదేవి, వైస్ సర్పంచ్ కొత్తకోట కిషోర్, పంచాయతీ కార్యదర్శి కిషోర్, యూనిట్ ఇన్చార్జ్ మహేశ్వర చిన్న, జడ్పీహెచ్ స్కూల్ చైర్మన్ ఎం.రాజేష్, ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు ఆర్.లోవరాజు, ఐసిడిఎస్, సిబ్బంది ఉన్నారు.

పార్వతీపురం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర

పత్తి రైతులపై ఇంత నిర్లక్ష్యమా?

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో పత్తి రైతులపైన ఆర్టికల్చర్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ఇప్పటి వరకు అధికారులు జాడ ఎక్కడా కనిపించలేదని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రశ్నించారు. మండల కేంద్రంలో రైతులు వేసిన పత్తి పంటలను ప్రజా సంఘాల నాయకులు ఆధ్వర్యంలో సోమవారం పరిశీలించారు. అనంతరం సాంబమూర్తి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ఏ ఉపేంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల రెడ్డి శివుడు నాయుడు మాట్లాడుతూ మండలంలో 3వేల ఎకరాల వరకు పత్తి రైతులు పంట వేశారని సరైన ఎరువులు, విత్తనాలు అందక పువ్వు మొగ్గ మొత్తం రాలిపోయే పరిస్థితి ఉందని అన్నారు. ఇలాంటి సందర్భంలో ఆర్టికల్చర్ అధికారులు ఎక్కడా కనిపించడంలేదన్నారు. వెంటనే రైతులు వేసిన ప్రత్తి పొలాలను ఆర్టికల్చర్ అధికారులు పరిశీలించాలని డిమాండ్ చేశారు. అలాగే క్వింటాకు రూ.15వేలు గిట్టుబాటు ధర కల్పించాలని, పత్తి దిగుబడి అధికంగా వచ్చేలా సూచనలు, సలహాలు, జిల్లాలో మూడు చోట్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు.

పత్తి పంటను పరిశీలిస్తున్న నాయకులు

ఐటిడిఎ పరిణామాలపై గవర్నర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి- పార్వతీపురం

స్థానిక ఐటిడిఎ ప్రాజెక్టు పరిధిలో జరుగుతున్న పరిణామాల పై రాష్ట్ర గవర్నర్‌కి ఫిర్యాదు చేయనున్నట్లు గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షుడు తాడంగి సాయిబాబు, ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్వతీపురం ఐటిడిఎలో ఏమి జరుగుతుందో అర్థం కావడం లేదన్నారు. ఆగష్టు నెల నుంచి రెగ్యులర్ పిఒ, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారి, ఐ ఎఒ, మేనేజర్‌లు లేరని అన్నారు. ఇప్పుడు డిడిని కూడా సరెండర్ చేయాలని చూస్తున్నారని అన్నారు. ఏళ్ల తరబడి పాలకవర్గ సమావేశాలు నిర్వహించలేదని గుర్తు చేశారు. ఐటిడిఎ కార్యాలయంలో గ్రీవెన్స్‌సెల్ నిర్వహించడం లేదని, దీని వల్ల గిరిజనులు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందని చెప్పారు. తాజా పరిణామాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్తామని సాయిబాబు, రంజిత్ కుమార్ చెప్పారు.

15 నెలల జీతాలివ్వకపోతే ఎలా బతకాలి

జిల్లాలో గల గర్భిణుల వసతి గృహాల్లో పని చేస్తున్న సిబ్బందికి 15నెలలుగా జీతాలివ్వకపోతే వారు ఎలా బతకాలని సాయిబాబు, కార్యదర్శి రంజిత్ కుమార్ ప్రశ్నించారు. సోమవారం గుమ్మలక్ష్మిపురం వైటిసి గర్భిణుల వసతి గృహం సిబ్బందితో కలిసి జెసి శోభికని కలిసి వినతిపత్రం అందజేశారు. చాలీచాలని జీతాలతో పని చేస్తున్న సిబ్బందికి 15నెలలుగా బకాయి పెట్టడం అన్యాయమని అన్నారు. వెంటనే వారి జీతాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వైటిసి వసతి గృహం సిబ్బంది పద్మావతి, శాంతి సుధ, ఎ.కళావతి, ఉషారాణి, బుజ్జి కుమారి పాల్గొన్నారు.

గ్రామసభలు పక్కాగా నిర్వహించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలో అక్టోబర్ 2వ తేదీన అన్ని గ్రామ సచివాలయాల్లో పక్కాగా గ్రామసభలు నిర్వహించాలని ఉపాధి హామీ ఎపిడి జి శ్రీహరి క్షేత్ర సహాయకులకు ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఫీల్డ్ అస్టెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించేందుకు వీలుగా పనులు గుర్తించేందుకు గ్రామ సభలు కచ్చితంగా నిర్వహించాలన్నారు. గ్రామ సభలు నిర్వహించలేదని ఫిర్యాదు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జాబు కార్డు లేని వారు దరఖాస్తు చేసుకుంటే తక్షణమే మంజూరు చేయాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ వై.వెంకటరమణ, ఎపిఒ జి.సత్యంనాయుడు, ఇంజనీరింగ్ కన్సల్ట్, టెక్నికల్ సహాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించేందుకు పంచాయతీలు వారీగా పనులు గుర్తించేందుకు గ్రామ సభలు నిర్వహించాలని ఎపిఒ మండల గౌరీనాథ్ వెల్లడించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం ఉపాధి హామీ పథకం సాంకేతిక, క్షేత్ర సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2 నుంచి గ్రామపంచాయతీల వారీగా పనులు గుర్తించేందుకు గ్రామ సభలు నిర్వహించనున్నామన్నారు. ఆయా గ్రామ పంచాయతీల్లో గ్రామానికి, రైతులకు అవసరమైన పనులను గుర్తించాలన్నారు. పనులు గుర్తింపును నవంబర్ 10లోగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో పలువురు సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

కిట్లు పంపిణీ

పాలకొండ: పట్టణంలో ఎన్‌కె రాజపురానికి చెందిన ఉర్లంకుల సూర్యారావు జ్ఞాపకార్థంగా తమ కుమారులు నారాయణరావుతో పాటు మరి కొంతమంది సోమవారం పాలకొండ కబడ్డీ టీం సభ్యులకు కిట్లను బహుకరించారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు పల్లా కొండలరావు చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షులు కోడి సుదర్శన రావు, ప్రధాన కార్యదర్శి వెన్నపు చంద్రశేఖర్, రామినాయుడు, ఉన్నారు.

2న గ్రామసభ

వీరఘట్టం: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఈ నెల 2న గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎపిఒ జి.సత్యం నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ చట్టం ద్వారా గ్రామాల్లో పనులు గుర్తించేందుకు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పత్తిలో ఆకు చుట్టుపురుగు : ఎఒ

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రస్తుతం పత్తిలో రసం పీల్చే పురుగులతో పాటు ఆకు చుట్టు పురుగు ఆశించిందని, దీని నివారణకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. పి.కోనవలస, పద్మాపురంలో పత్తి పంటను పరిశీలించారు. పత్తిలో ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో రసం పీల్చే పురుగుల ఉధృతి అధికంగా ఉందని, దీని నివారణకు తయోమెతాక్జోమ్, ఎసిటమిప్రిడ్. ఇమిడా క్లోప్రిడ్ మందుల్లో ఒకదాన్ని 100 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి చేను బాగా తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. సూక్ష్మ పోషక లోపాల నివారణకు బోరాన్ మూడు గ్రాములు, మెగ్నీషియం 10 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు.

ఆకు చుట్టు పురుగు నివారణ

శాస్త్రీయంగా ఆకు చుట్టు పురుగును సైలెప్త డెరిగోట అని పిలుస్తారు. సాధారణంగా ఈ పురుగు ఒక నెలలో 170 మిల్లీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనప్పుడు గాలిలో తేమ 80 శాతం వరకు ఉన్నప్పుడు ఎక్కువగా ఆశిస్తుంది. పిల్ల పురుగులు ముందుగా ఆకు అడుగుభాగాన చేరి పత్ర హరితాన్ని తినేస్తాయి. క్రమేపీ పెద్దవైన ఆ తర్వాత ఆకులను శంఖం ఆకారంలో చుట్టుకుని లోపల ఉండి ఉధృతమైన పరిస్థితుల్లో ఆకులను పూర్తిగా తినేస్తాయి. వీటి నివారణకు ఫేమ్ అనే మందు 40 మిల్లీలీటర్లు లేదా కోరాజన్ అనే మందు 60 మిల్లీమీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరానికి పిచికారీ చేసుకొని నివారించుకోవచ్చన్నారు. విఎఎలు నాగమణి, పవిత్ర పాల్గొన్నారు

బంగారం దొంగిలించిన వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని బిటివాడ గ్రామానికి చెందిన కెల్ల యోగేశ్వరరావు అనే వ్యక్తిని ఈనెల 29వ తేదీన వండవ గ్రామ జంక్షన్ వద్ద బంగారంతో పట్టు పడడంతో అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్ఐ జి కళాధర్ సోమవారం తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన బమ్మిడి ముక్కల చంద్రకళాదేవి ఆరున్నర తులాల బంగారం 37 తులాల వెండి పోయినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడంతో యోగేశ్వరరావుపై అనుమాన రావడంతో అతనిపై నిఘా పెట్టి పట్టుకున్నామన్నారు. సోమవారం పాలకొండ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

3322 మద్యం సీసాలు ధ్వంసం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని ఇప్పటి వరకు పట్టుబడ్డ 3,322 మద్యం సీసాలను ఎఎస్‌పి సరాన అంకిత మహావీర్ సమక్షంలో సోమవారం ధ్వంసం చేసినట్టు ఎస్ఐ సింహాచలం తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో 3322 (సుమారు 618 లీటర్లు) మద్యాన్ని, 40 లీటర్ల నాటు సారా ప్యాకెట్లను ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు.

ఇ-పంట నమోదును పరిశీలించిన ఎఒ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కాశీపేట గ్రామంలో ఈ పంట నమోదును ఎఒ ఎస్.అవినాష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పంట నమోదులో రైతుల పంటలను నమోదు చేయాలని ఏఏ పంటలు ఉన్నాయో పూర్తిస్థాయిలో నమోదు చేయాలని సూచించారు. అందరూ రైతులు ఈ పంట నమోదు చేసి ఖరీఫ్ సీజన్‌లో ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు అందరూ ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

గొంతు తడిపేదెప్పుడు?

కస్పా వీధి దళిత మహిళలు ఆవేదన

ప్రజాశక్తి - వీరఘట్టం

తాగునీరు లేక తమ గొంతులు ఎండుతున్నాయని, కుళాయి పాయింట్లు ద్వారా పూర్తిస్థాయిలో తాగునీరు ఎప్పుడు సరఫరా చేస్తారని మండల కేంద్రంలోని కస్పా వీధికి చెందిన దళిత మహిళలు సోమవారం మేజర్ పంచాయతీ ఇఒ ఎం.రవి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. రక్షిత మంచినీటి పథకం కుళాయిల ద్వారా గత రెండు నెలల నుంచి తమ వీధికి తాగునీరు సక్రంగా సరఫరా కాకపోవడంతో గొంతు తడుపుకొనేందుకు గుక్కెడి నీటి కోసం ఎగువ ప్రాంతానికి వెళ్లి నీరు తెచ్చుకొని దాహార్తిని తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వీధుల్లో ఏర్పాటు చేసిన కుళాయి పాయింట్ల ద్వారా కొద్దిపాటి నీరు రావడంతో నీటి కోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని సెప్టెంబర్ 12న వినతిని ఇచ్చినప్పటికీ కనీసం చర్యలు తీసుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి తక్షణమే తాగునీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని దళిత మహిళలు ఇఒను కోరారు.

తాగునీటి సమస్యపై ఇఒను నిలదీస్తున్న మహిళలు

ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - కురుపాం

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసిన సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ ఉద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం కురుపాంలో గల మద్యం దుకాణాల ఎదుట మహిళ సంఘాల సభ్యుల మద్దతుతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటీ పాలసీ అనే నిర్ణయం తీసుకొచ్చినందున రాష్ట్రంలో మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సుమారు 15 వేల మంది నిరుద్యోగులవుతారన్నారు. వీరందరికీ ప్రభుత్వంలో ఖాళీలు ఉన్న వేరే చోట అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం అవకాశం కల్పించకపోతే రోడ్డున పడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మద్యం దుకాణ ఉద్యోగులు ఈదల ఉదయ్, బాలు తదితరులు పాల్గొన్నారు .